# ఆ వృద్ధుడు

"వల్లరి"

[తాటిచెట్టునీడలో చిన్న మట్టిదిబ్బ వొకటి విశ్రాంతి తీసుకుంటూన్నది. నల్లి వేరుతీగ అల్లిబిల్లిగా ప్రాకింది. చిట-పట రాలుతుంటాయా సమాధిమీద కల్లుబొట్లు.]

●

సూ[illegible] పశ్చిమ దిశను [illegible] మౌతున్నాడు. వేసవి వడగాలి వీచివీచి చల్లని పిల్లవాయువులు మృదుస్పర్శ జేస్తున్నాయ్, వీధి అరుగుమీద కూర్చున్నాను స్థంభాని కానుకుని. ఎదురుగా వో పది హేను గజాల దూరంగావున్న ఇంట్లోంచి ఇవతలికి వచ్చాడొక వృద్ధుడు. అతనికి నలభై సంవత్సరాలుంటాయ్ అని నిర్ధారణ చేసుకొన్నాను.—వృద్ధుడు, ఎందుకంటే భారతీయునియొక్క సరాసరి వయస్సు యిరవైయేడు సంవత్సరాలు మాత్రమే. కాబట్టి అతడు వృద్ధుడు. నిశ్చయంగా!

"ఎంతదగ్గర బంధువైనా డబ్బు ప్రధానం...ధనం మూలమిదంజగత్".

ఎంత దీనంగా వుందతని వుచ్చారణ! దీన్నిబట్టి చూస్తే ఆతడొకప్పుడు కరస్సీనోట్ల మీద పికారుచేసినట్టు తెలియక తెలుస్తూ వుంది.

అరుగుప్రక్కగా యిద్దరు పిల్లలు యిసుకలో ఆడుకుంటున్నారు. ఆ వృద్ధుని చూచి "తాత-తాత" అంటూ తప్ప టడుగులు వేస్తూ యెదురుగా వెళ్లారు.

"తాత......కానీ ఇవ్వవ్..." అంటూ చెయ్యి వొకడు పట్టుకుని వ్రేలాడారు.

"తాత.....యెందుకూ కొంఅగాని తాత" అంటూంటే వాని కళ్లవెంబడి బొటబొట నీళ్ళు రాలాయ్. కంపిత స్వరంతో "బాబు-అదుగో! విమానం--చూడు" అంటూ ఆకాశం చూపెట్టాడు.

ఆ పిల్లలిద్దరు విమానం చూస్తూ నుంచున్నారు.

అతడు నెమ్మదిగా యింటిప్రక్క నుంచి మలుపుతిరిగి సాగిపోయాడు.

ఆ వృద్ధుడెవరో తెలుసుకోవాలన్న కుతూహలం జనించింది నాలో—అతడ్ని వెంబడించాను.

ఆతడు పోయిపోయి ఒక సారా దుకాణం ప్రవేశించాడు. నేను బయట వుండి పొంచి చూస్తున్నాను. "డబ్బు లేకుండా యెందుకు త్రాగావు" అంటూ గద్దించాడొకడు. తప్పత్రాగి పాటలు పాడు తున్న వాళ్ళంతా చుట్టూ మూగారు. తలో మాట అన్నారు నిషాగా—ఆ సందట్లో వృద్ధుడు బయటికివచ్చేశాడు.

మళ్లా అతడు సాగిపోతున్నాడు ఈశాన్యదిశగా! వాడిని—కాదు. అతడు యెందుకంటే వాడు అని సంబోధించడం నా అంతరాత్మ ఒప్పుకోలేదు. కాబట్టి అతడు అని కొంచెం మర్యాదగా సంభోదిస్తాను. నేను వెంబడించాను. అతడుముందు —నేను వెనుక యిరువై గజాలయెడంగా నడుస్తున్నాం.

నలుదిక్కులూ పరికిస్తూ, తూలుతూ వడివడిగా నడుస్తున్నాడతను.

నేను వాని కగుపడకుండా వెంబడిస్తున్నాను...

కాలువవంతెన సమీపించాం. వేసవి ఎండకి కాలువ యెండిపోయింది. ఆ రే చీకట్లో తెల్లని చీర ధరించిన స్త్రీవ్యక్తి యెదురుగా వచ్చింది. ఆ వృద్ధుడు తప్పుకుని మరోప్రక్కగా నడవబోయాడు. కాని ఆమె మళ్ళీ ఆ ప్రక్కగా అడ్డువచ్చింది.

దెయ్యమోనని భయపడ్డాను. కాని వెంటనే ధైర్యం తెచ్చుకున్నాను. అదేమో చూడవలెనని చెట్లచాటుకు తప్పుకుని చూస్తున్నాను.

ఆమె అతని చేయిపట్టుకుంది. వంతెన క్రిందనుంచి వాళ్ళునడచి వెళ్లిపోయారు. ఆ చీకట్లో వాళ్ళు మళ్లీ నాకగుపడలేదు.

నేను తిరిగి వచ్చేశాను.

యూనివర్సిటీ పరీక్షలు యింకా నాల్గురోజులు గడువుండి మధ్యాహ్నం మూడువేళ చదువుకునేందుకు అలా తోటలోకి వెళ్ళాను. తోటచుట్టూ పెద్ద ప్రహరీ గోడలా దట్టంగా తాడి చెట్లు పెరిగి వున్నాయి.

నేను కొంతదూరంలో వేపచెట్టునీడలో కూర్చుని చదువుకొంటున్నాను.

ఒకతాటిచెట్టుక్రింత ఆ వృద్ధుడు కనపడ్డాడు. నా దృష్టి అటు మళ్లింది.

ఆతడు చెట్టుపై కెగ్రాకాలని ప్రయత్నిస్తున్నాడు. రెండుగజాలుమాత్రం ఎక్కి క్రిందకుదిగిపోతున్నాడు...

చంచలంగా దృష్టులు పరికించి చూచాడు—యేదో జ్ఞప్తికివచ్చినట్లు—

రాళ్ళు రువ్వేడు చెట్టుమీదికి యశశక్తులూ ప్రయోగించి. చివరికొక కుండ వ్రిచ్చింది. వృద్ధుడు దోసలిపట్టాడు. కాని కల్లంతా నేలపాలయింది. అంజలిలో కొద్దిగా రాలింది. మహదానందంతో త్రాగాడు. జూరాడు-కాని తృప్తి?

ఇంతలో గీతగాడు వచ్చాడు. ఆ దృశ్యమంతా చూసి మండిపడిపోయాడు. నోటికివచ్చినట్లలా తిట్టాడు. చెట్టెక్కుతూ కోపంగా, నిరసనగా "ఛా"- మని మోచేత్తో నెట్టాడు. వృద్ధుడు తూలి పడిపోయాడు.

అది చూడకుండానే చెట్టెక్కిపోయాడు, గీతగాడు.

చిటపొట......కల్లుబొట్లు రాల్తున్నాయ్. ఆ వృద్ధుడు నెమ్మదిగా దేక్కుంటూపోయి నోరు తెరచుకొని పండుకున్నాడు. ఆ చిన్ని కల్లుబిందువులు ఆతని సేదతీరుస్తున్నాయ్!

గీతగాడు చెట్టుపైనుంచి క్రిందకు చూశాడు దురదృష్టవశాత్తు నడుముకున్న పట్టుజారి క్రిందపడ్డాడు-వృద్ధుడిమీద-పడటంలో కొడవలి వృద్ధునికి గుచ్చుకుంది! లోతుగా!!!

కొడవలి ఆ వృద్ధుడి అసువుల్ని తీసింది!!!

గీతగానికి బలంగా గాయాలు తగిలాయ్. రక్షకభటులు ఆతన్ని తీసుకు వెళ్ళిపోయారు.

తాడిచెట్టునీడలో చిన్న మట్టిదిబ్బ ఒకటి విశ్రాంతి తీసుకుంటున్నది. నల్లివేరు తీగ అల్లిబిల్లిగా ప్రాకింది. చిట—పట... రాలుతుంటాయా సమాధిమీద కల్లుబొట్లు!!!

[కథ ఊహా నిర్మాణముమాత్రమే.]

మీ ప్రియమైన

"Asha" REGD.

స్నో
ఫేస్ పౌడర్లు

మీ ముఖవర్చస్సుకి సరిపడు 8 రకాల రంగులు, "ఆషా" స్కిన్‌టోన్, బ్రాహ్మితైలము, బ్రిలియంటైన్, పండ్లపొడి మరియు హేర్‌టానిక్ మొదలగువాటిని వుపయోగించండి.

అన్ని పెద్ద అంగళ్ళలో దొరకును.

సౌత్ ఇండియాకు సోల్ ఏజంట్లు:

బాంబే ట్రేడింగ్ కంపెనీ.

326, చిక్కపేట : : బెంగుళూరు సిటీ.